క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి వెండి ఆభరణాల బహూకరణ

ఏలేశ్వరం: స్థానిక సాయిబాబా మెట్ట వద్ద వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి మంగళవారం దాతలు వెండి ఆభరణాలు బహూకరించారు. పట్టణానికి చెందిన దాతలు గెద్ద సత్యనారాయణ, నాగమణి దంపతులు, బూడి విజయ్, చందక వెంకటేష్, అప్పాజీ 80 గ్రాముల వెండితో చేసిన రెండు మంగళసూత్రాలు, ఇత్తడి దీపారాధన కుందులను అర్చకుడు సుబ్రహ్మణ్యానికి అందజేశారు. అట్టాడ శ్రీను, పత్తిగుళ్ల దుర్గాప్రసాద్, నాగేంద్ర, చైతన్యకృష్ణ, నాగార్జున, జ్యోతి, సూరిబాబు, గంగాధర్, భవాని పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి కుర్చీల బహూకరణ

జగ్గంపేట: రాజపూడి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అదే గ్రామానికి చెందిన యెజ్జు ఉమాపార్వతీశం 25 కుర్చీలను అందజేశారు. ఉమా పార్వతీశం రాజపూడి పీహెచ్‌లో ఎంపీహెచ్‌ఎస్ (ఎం)గా పనిచేస్తున్నారు. సీహెచ్‌ఓ శర్మ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో–స్కూటీ ఢీ : వ్యక్తికి గాయాలు

తొండంగి: గోపాలపట్నం రైల్వేస్టేషన్ రోడ్డులో మంగళవారం ఆటో, స్కూటీ ఎదురెదురుగా వెళ్తూ ఢీకొన్న సంఘటనలో అన్నవరం దేవస్థానానికి చెందిన వ్రత పురోహితుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొండంగి వైపు నుంచి అన్నవరం వెళ్తున్న ఆటో ముందు కారు వెళ్తుంది. ఆ కారును తప్పించబోతుండగా ఎదురుగా అన్నవరం వైపు నుంచి వస్తున్న స్కూటీని ఆటో ఢీకొంది. స్కూటీపై వస్తున్న దేవస్థానం వ్రత పురోహితుడు సాయికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అదే ఆటో డ్రైవర్ సాయిని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. ఈ ఘటనలో ఆటో, స్కూటీ దెబ్బతిన్నాయి. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని తొండంగి పోలీసులు తెలిపారు.

పామాయిల్ సాగుపై అవగాహన

జగ్గంపేట: మామిడాడ గ్రామంలో పామాయిల్ తోటల సాగుపై మంగళవారం అవగాహన కల్పించారు. పతంజలి పామాయిల్ సంస్థకు చెందిన డీజీఎం ప్రకాష్ రైతులకు తోటల్లో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతలు, తెగుళ్ల నివారణ, సస్యరక్షణ చర్యలపై వివరించారు.

బాధితులకు సాయం

శంఖవరం: జి.కొత్తపల్లిలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులైన పెద్దాడ చంటమ్మ, నురుకుర్తి నాగలక్ష్మి కుటుంబాలకు సాయి ప్రియ ట్రేడర్స్ అధినేత జ్యోతుల శ్రీనివాస్ సాయం అందజేశారు. నిత్యావసరాలు బియ్యం, కిరాణా, రగ్గులు, చాపలు, దుప్పట్లు, దుస్తులు, నగదు అందజేశారు. వైస్ ఎంపీపీ ఈగల అప్పారావు, సర్పంచ్ ఈగల విజయదుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తుని రూరల్: తేటగుంట శివారు రాజులు కొత్తూరు వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు రూరల్ ఎస్సై ఎ.బాలాజీ తెలిపారు. మంగళవారం జరిగిన ఈ ప్రమాదంలో విజయనగరం జిల్లా రాజాం మండలం పొగిరి గ్రామానికి చెందిన మజ్జి తేజస్(23) మృతి చెందాడన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. స్వగ్రామం నుంచి గుంటూరుకు ప్రైవేట్ బస్సులో తేజస్ ప్రయాణిస్తున్నాడు. రాజులకొత్తూరు వద్ద ముందు వెళుతున్న వాహనదారుడికి, బస్సు డ్రైవర్‌కు వివాదం జరుగుతుండగా తేజస్ బస్సు దిగి, హైవేపై నిలబడి ఉన్నాడు. అదే సమయంలో విశాఖపట్నం నుంచి విజయవాడ వెళుతున్న మరోక వాహనం తేజస్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందతూ మృతి చెందినట్టు ఎస్సై బాలాజీ వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డ్రోన్ టెక్నాలజీలో శిక్షణ


మణిదీప్‌ను అభినందిస్తున్న కమిషనర్ ప్రసాదరాజు

తుని: పురపాలక సంఘం ప్రణాళికా విభాగానికి చెందిన జె.మణిదీప్ డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ పొందాడని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మణిదీప్‌కు ధ్రువీకరణ పత్రం అందజేశారు. కమిషనర్ ప్రసాదరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న శాశ్వత భూహక్కు ప్రాజెక్టు కోసం మున్సిపాలిటీ నుంచి ఒకరిని శిక్షణ కోసం ఎంపిక చేసిందన్నారు. హైదరాబాద్ ఉప్పల్‌లోని నేషనల్ ఇనిస్టూట్ ఫర్ జియో ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీలో శిక్షణ పొందారన్నారు. డ్రోన్ ఇమేజ్ డేటా ప్రోసెస్, క్వాలిటీ కంట్రోల్‌పై తర్ఫీదు పొందినట్టు వివరించారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో మంగళవారం కాకినాడ మెడికవర్ హాస్పిటల్ వైద్యులు ప్రశోబకుమార్ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సంభవించే మరణాలలో క్యాన్సర్ మూలంగా సంభవించే మరణాలే ఎక్కువని, అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ, నివేదికలో పేర్కొన్న ప్రకారం 2026 ఏడాది నాటికి ఈ క్యాన్సర్ మరణాల సంఖ్య ఏడాదికి 20 లక్షల వరకూ ఉందని అంచనా వేసినట్టు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డోలా సంజయ్, డీన్ ఏ రామకృష్ణ, ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లక్కింశెట్టి ఈశ్వర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త నాటకానికి తెర లేపిన ‘యనమల’

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ

కోటనందూరు: తన సోదరుడు యనమల కృష్ణుడు గత 40ఏళ్లుగా తుని నియోజకవర్గాన్ని దోచుకున్నాడని, ప్రజలకు చేసింది ఏమీ లేదంటూ ఓట్లు దండుకునేందుకు యనమల రామకృష్ణుడు కొత్త నాటకానికి తెర లేపారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆరోపించారు. మంగళవారం స్థానిక మదర్ కళాశాల ఆవరణలో ‘మా నమ్మకం నువ్వే జగనన్న’ పేరుతో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత 40 ఏళ్లగా తన సోదరుడు దోచుకున్న సొమ్మును బాధిత కుటుంబాలకు చెల్లించి ప్రజల్లోకి రావాలని మంత్రి డిమాండ్ చేశారు. గత ఎన్నికల ముందు గొర్రెలు, మేకలు రుణాల పేరుతో నాలుగు కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును పరోక్షంగా ప్రజలకు పంచి పెట్టారన్నారు. తుని నియోజకవర్గానికి యనమల సోదరులు చేసింది ఏమీ లేదన్నారు. చంద్రబాబు పాలనలో కరువు రాజ్యమేలిందన్నారు. గత ప్రభుత్వంలో సామాన్య మానవులు పన్నుల రూపంలో చెల్లించిన సొమ్మంతా చంద్రబాబు బినామీల జేబుల్లోకి వెళ్లిందని మండి పడ్డారు. గతంలో వచ్చిన పన్నులే ఇప్పుడూ వస్తున్నాయని, అయితే ఇప్పుడున్న సంక్షేమం అప్పుడెందుకు లేదని ప్రశ్నించారు. పార్టీ ఆవిర్భావం నుంచి కోటనందూరు మండలం వైఎస్సార్ సీపీకి, తనకు అండగా నిలిచిందన్నారు. ఈ మండల ప్రజలు 2014లో 5 వేల మెజారిటీ ఇస్తే 2019లో 6వేల మెజారిటీ గెలిపించారన్నారు. ఈ మండల ప్రజల రుణం తీర్చుకుంటూ రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా రూ.470 కోట్లతో ఏలేరు–తాండవ ఎత్తిపోతల పథకానికి నిధులు తీసుకొచ్చాన్నారు. వచ్చే ఆరు నెలల్లో ప్రతి ఇంటికీ కుళాయిలతోపాటు జూనియర్ కళాశాల


గృహసారథుల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. వైఎస్సార్ సీపీలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. అందులో భాగంగానే గృహసారథులు, సచివాలయ కన్వీనర్లలో సింహభాగం మహిళలున్నారన్నారు. గ్రామ వలంటీర్లు ప్రభుత్వ పరంగా చక్కగా పని చేస్తున్నారన్నారు. వలంటీర్ల నుంచి సమాచారం తీసుకుని గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల స్థానిక నాయకులతో సమన్వయంగా పని చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి వివరించి ప్రభుత్వ పనితీరును సేకరించాలని సూచించారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా కుట్రలు, ప్రభుత్వ తీరును ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ లంక ప్రసాద్, రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ, లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, మాజీ చైర్మన్లు లాలం బాబ్జీ, బొంగు ఉమారావు, సొసైటీ అధ్యక్షుడు గొర్లి అచ్చియ్యనాయుడు, మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి గోవిందు, ఏఎంసీ చైర్మన్ మాకినీడు బాబు, వైఎస్సార్ సీపీ తుని, కోటనందూరు మండల కన్వీనర్లు పోతల రమణ, చింతకాయల చినబాబు, కో ఆప్షన్ సభ్యుడు కోటసత్తిబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విజయమే ఊపిరిగా పనిచేయాలి

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన స్థానిక వెంకటేశ్వరా ఫంక్షన్ హాలులో మంగళవారం వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు విజయం కోసం కష్టపడి పనిచేయాలన్నారు. సీఎం జగన్ రెండోసారి ముఖ్యమంత్రి చేసే బాధ్యత మనపై ఉందన్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకే కన్వీనర్లు, గృహసారథులను నియమించామన్నారు. పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికీ ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. సీఎం జగన్ అన్నివర్గాలకు సమన్యాయం చేశారన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కుడుపూడి భరత్, రాష్ట్ర దృశ్య కళల చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. పార్టీశ్రేణులంతా విజయం కోసం కృషి చేయాలన్నారు. పార్టీ నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, బొదిరెడ్డి గోపి, సామంతుల సూర్యకుమార్, శిడగం త్రివేణి, సుంకర రాంబాబు, దోశీ కిషోర్, నాగేశ్వరరావు, ప్రసాద్, వీరరాఘవస్వామి, పైలశ్రీధర్, చిన్నారావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేయాలి

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక సూర్య ఫంక్షన్ హాలులో మంగళవారం మండల సచివాలయ కన్వీనర్ దాసరి రమేష్ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలోని అన్ని వర్గాలకు చెందిన అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ వ్యవస్థ ఇంకా పటిష్టంగా అమలు చేసేందుకు, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తోడ్పాటు నందించాలన్నారు. అనంతరం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు వారి విధి విధానాలపై రామచంద్రాపురం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ఒమ్మి రఘురాం శిక్షణనిచ్చారు. జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు దాసరి తమ్మన్నదొర, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, సుంకర వీరబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గుల్లా ఏడుకొండలు, కర్రి సూరారెడ్డి, దాసరి సతీష్‌బాబు, తుమ్మల చిన్నబ్బు, నరాలశెట్టి నర్శయ్య, తోలేటి రాంప్రసాద్, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), వైస్ ఎంపీపీ మైనర్‌బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊరూరా అభివృద్ధి.. ఇంటింటా సంక్షేమం

- పారదర్శకంగా జగనన్న పాలన
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే పర్వత


ప్రత్తిపాడులో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ప్రత్తిపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఊరూరా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం సాయంత్రం ప్రత్తిపాడులోని ఎండీ పేట ప్రాంతంలో నిర్వహించిన ‘గడప గడపకూ మన ప్రభుత్వం’ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి కుటుంబాన్ని పలుకరించారు. ఆయన ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించి, వారు పొందిన లబ్ధిని తెలియజేశారు. అనంతరం గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి, ప్రజా సంక్షేమానికే పని చేస్తుందని వెల్లడించారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసి, పేదల అభ్యున్నతికి కృషి చేసిన ఎకైక సీఎం జగనన్నే అని అన్నారు. రాష్ట్ర అభివృద్ధే, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న జగనన్నకు ప్రజలు తోడుండాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పత్రి రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి చినబాబు, శేరు కృష్ణ, ఆకుల వీరబాబు, గుడాల వెంకటరత్నం, తాతపూడి బుజ్జి, మదినే నూకరాజు, బెహరా నానాజీ, అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరు జీయర్ స్వామికి కామధేను పురస్కారం


కామధేను పురస్కారాన్ని అందుకుంటున్న ప్రసాదాచార్యులు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జీయర్ మఠాధిపతి పాడుగు వెంకట సత్యనారాయణ ప్రసాదాచార్యులుకు కామధేను పురస్కారం లభించింది. పరవస్తు రామానుజాచార్యుల వారి విశిష్టాద్వైత సంప్రదాయ ప్రచారం, వైష్ణవ ధర్మ ప్రచారం, హిందూ ధర్మ పరిరక్షణకు చేసిన కృషికి గాను ఈ పురస్కారం ప్రదానం చేశారు. నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట లలితా మహేశ్వరి ఆశ్రమం దత్త పీఠంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో పీఠాధిపతి రామాయణం మహేష్ స్వామి, ఇతర ఆగమ పండితుల చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నట్టు ప్రసాదాచార్యులు మంగళవారం తెలిపారు. మఠాధిపతిగా ప్రసాదాచార్యులు, పీఠాధిపతిగా ఛత్రపతి శివాజీ గురువు సమర్ధ రామదాసు వంశీకులైన తెలంగాణకు చెందిన ఆత్మానంద స్వామి, ఆదిశంకర మందిర పీఠాధిపతి (నెల్లూరు) సమయానంద స్వామితో పాటు అర్చకులు, ఆగమ సలహాదారులకు ఈ పురస్కారాలు అందజేశారని వివరించారు. హిందూ ధర్మం, సంస్కృతీ సంప్రదాయాలు మరింత అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా ప్రసాదాచార్యులు తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాబోధన

తుని రూరల్: ఈ సంవత్సరం పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాబోధన జరుగుతుందని డీఈఓ అబ్రహం అన్నారు. మంగళవారం ఎస్.అన్నవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వి.కొత్తూరులో కస్తూర్బా గాంధీ విద్యాలయాలను డీఈఓ అబ్రహం సందర్శించారు. ఆయా స్కూళ్లలో రికార్డులు, మధ్యాహ్నం భోజనాలను పరిశీలించిన డీఈఓ హైస్కూల్లో హెచ్‌ఎం, కేజీబీవీలో ప్రత్యేక అధికారిని విద్యాబోధనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు ఏయే సమయాల్లో ప్రత్యేక (అదనపు) తరగతులు నిర్వహిస్తున్నారు, రోజువారీ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అర్హులైన ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌ల అందాయాని ప్రశ్నించారు. మనబడి నాడు–నేడు పనులను పరిశీలించారు. ఎంఈఓ పరవాడ గీతాదేవి, కేజీబీవీ ప్రత్యేక అధికారి అమృతవాణి పాల్గొన్నారు.


వి.కొత్తూరు కేజీబీవీలో ప్రత్యేక తరగతుల నిర్వహణను పరిశీలిస్తున్న డీఈఓ అబ్రహం

కోటనందూరు: విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంచి మంచి ఫలితాలు సాధించాలని డీఈఓ అబ్రహం ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం బిళ్లనందూరు, ఇండుగపల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఎంఈఓ శ్రీనివాస్ ఉన్నారు.

విద్యా రంగానికి పెద్దపీట

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

ఏలేశ్వరం: ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాడు–నేడులో భాగంగా రూ.2.04 కోట్లతో 17 అదనపు తరగతుల నిర్మాణానికి ఎమ్మెల్యే మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నారని తెలిపారు.

విద్యార్థిని సత్కరించిన ఎమ్మెల్యే

రాష్ట్రస్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కాశీసింహాద్రిని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ సత్కరించారు. ఇటీవల విజయవాడలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో 96 కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్ దక్కింది. మన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, పార్టీనాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, సుంకర రాంబాబు, దిలబర్‌హుస్సేన్, యండగండి నాగబాబు, హెచ్‌ఎం తులసీదాసు పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ప్రజల్లోకి ‘మా నమ్మకం నువ్వే జగనన్న’

తుని: మా నమ్మకం నువ్వే జగనన్న నినాదాన్ని ప్రజల్లోకి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కౌన్సిలర్లు తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు కోరారు. మంగళవారం తుని పురపాలక సంఘం కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు కౌన్సిలర్లు, నాయకులు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకూ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని తెలియజేయాలన్నారు. తుని మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


తుని సదస్సులో మాట్లాడుతున్న ఏలూరి బాలు

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

శంఖవరం: అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం దత్తత దేవాలయంగా ఉన్న శివాలయం అభివృద్ధి పనులు, సత్యదేవ కల్యాణ మండపానికి సంబంధించి మరమ్మతు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించి జరుగతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఎంపీపీ పర్వత రాజుబాబు, సతీష్, అప్పారావ పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయండి

ప్రత్తిపాడు రూరల్: సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ 11వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకుడు మానుకొండ లచ్చబాబు పిలుపునిచ్చారు. చింతలూరు గ్రామంలో జాతీయ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ పాట్నాలో జరిగే జాతీయ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. లిబరేషన్ పార్టీ నాయకులు తాడి నాగేశ్వరరావు, సింహాచలం, చెల్లబాబు, ప్రభుదాసు, అప్పారావ పాల్గొన్నారు.

రైతులు విధిగా ఈ పంట నమోదు చేయించుకోవాలి

గోకవరం: రబీ సాగు చేస్తున్న రైతులు విధిగా ఈ–పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి పి.రాజరాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఈకేవైసీ ద్వారా సాగు విస్తీర్ణం, సర్వే నంబర్లు సరిచూసుకోవాలన్నారు. మండలంలోని 1780 మంది రైతులు రబీలో 6,120 ఎకరాల్లో మొక్కజొన్న, నువ్వులు, అపరాలు సాగు చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు కేవలం 926 మంది మాత్రమే రైతులు ఈకేవైసీ నమోదు చేశారని, మిగిలిన రైతులు ఈనెల 20 నాటికి పూర్తి చేసుకోవాలన్నారు. లేకపోతే ధాన్యం అమ్మకాలకు, పంట ధ్రువీకరణ పత్రాలు పొందడానికి వీలుండదన్నారు.

గ్రామాల్లో ‘ఫ్యామిలీ డాక్టర్’

గండేపల్లి: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సేవలందిస్తున్నారని ఆస్పత్రి కమిటీ చైర్మన్, ఎంపీపీ చలగళ్ల దొరబాబు తెలియజేశారు. గండేపల్లిలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రత్తిపాడు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు లయన్స్‌క్లబ్ సభ్యులు మంగళవారం పౌష్టికాహారాన్ని అందజేశారు. ఏడిద పదీప్‌చక్ర సమకూర్చిన పౌష్టికాహారాన్ని సీహెచ్‌సీ ఇన్‌చార్జి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ ఎం.కన్యాకుమారి అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గుడాల వెంకట రత్నం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, మినర్వా విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డీవీఎస్ రమేష్‌రాజు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు తాతా సాంబు, ఇంజినీర్ బి.మోహన్, ఏడిద రెడ్డినాయుడు పాల్గొన్నారు.

వంద లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

జగ్గంపేట: మామిడాడ శివారు ప్రాంతంలో సారా తయారీ ప్రాంతాలపై జగ్గంపేట ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ సిబ్బందితో మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి, 5 లీటర్ల సారాతో ఉన్న రాయుడు శ్రీనును అరెస్టు చేసినట్టు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.

టిప్పర్ లారీ బోల్తా

గోకవరం: వీరలంకపల్లి గ్రామ శివారున మంగళవారం టిప్పర్ లారీ బోల్తా పడింది. వివరాల ప్రకారం.. వీరలంకపల్లి గ్రామ శివారున ప్రధాన రహదారిపై రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డుపై నీరు వేసేందుకు వచ్చిన టిప్పర్ లారీకి బ్రేకులు ఫెయిల్ అయ్యి అదుపు తప్పి పడిపోయింది. ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

పశుపోషణతో ఆర్థికాభివృద్ధి

రౌతులపూడి: ప్రస్తుత తరుణంలో పశుపోషణతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని మండల పశువైద్యాధికారి ఎం.వీర్రాఘవరావు అన్నారు. మంగళవారం రాజవరం సచివాలయ పరిధిలోని మహిళా పాడి రైతుల సహకార సంఘాలను ప్రోత్సహించేందుకు, సంఘాల బలోపేతానికి జగనన్న పాలవెల్లువలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు దిగువశివాడ సర్పంచ్ కె.దేవుడు, రాజవరం వైఎస్సార్ సీపీ నాయకుడు సోమరౌతు తిరుముల వెంకన్నదొర ముఖ్య అతిథితుగా హాజరై మాట్లాడారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

ప్రత్తిపాడు: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. చినశంకర్లపూడి గ్రామంలో మంగళవారం సాయంత్రం జలజీవన్ మిషన్ నిధులు రూ.28.70 లక్షల వ్యయంతో నిర్మించిన 60 వేల లీటర్ల కెపాసిటీ గల రక్షిత మంచినీటి పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రత్తిపాడులో జలజీవన్ మిషన్ నిధులు రూ.26 లక్షలతో నిర్మించనున్న 20 లీటర్ల కెపాసిటీ గల మంచినీటి పథకం నిర్మాణానికి, జెడ్పీటీసీ నిధులు రూ.5.40 లక్షలతో నిర్మించనున్న రెండు డ్రైన్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

జగ్గంపేట: వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 43 బస్తాలు పీడీఎస్ రైసును మంగళవారం గొల్లలగుంట గ్రామం వద్ద విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి నాలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు జగ్గంపేట ఎంఎస్ఓ జి.కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఏలేశ్వరం నుంచి అక్రమంగా వ్యాన్‌లో జగ్గంపేట తరలిస్తున్న పీడీఎస్ రైసును గొల్లలగుంట హైస్కూల్ వద్ద కాపు కాసి పట్టుకున్నట్టు తెలిపారు. ఈ సంఘటనలో డ్రైవర్ నామాల వెంకట రాజు గోపాలకృష్ణ, బుర్రి విష్ణు (లింగంపర్తి), బొజ్జా రాజా (ఏలేశ్వరం), వాహనం యజమాని దమ్మాన గంగాధర్‌లను పట్టుకుని, కేసు నమోదు చేసి పోలీసులకు అప్పగించినట్టు చెప్పారు. బియ్యాన్ని సివిల్ సప్లయిస్ గొడౌన్‌కు తరలించినట్టు తెలిపారు.

సత్యదేవునికి జన్మనక్షత్ర పూజలు

అన్నవరం: రత్నగిరివాసుడు సత్యదేవుని జన్మనక్షత్రం ‘మఖ’ సందర్భంగా మంగళవారం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరుల మూల విరాట్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. యాగశాలలో స్వామి వారికి ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున ఒంటి గంటకు సత్యదేవుని ఆలయం తెరిచి పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవారు, శంకరుల మూలవిరాట్‌లకు అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. తొమ్మిది గంటలకు యాగశాలలో ఆయుష్య హోమం నిర్వహించారు. 11 గంటలకు పూర్ణాహుతి చేశారు. పూజా కార్యక్రమాలను వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠి, యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట శ్రీనివాస్, స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితులు ముత్య సత్యనారాయణ, పాలంకి పట్టాభి చేశారు.


మంత్రి వేణుకు సత్యదేవుని ప్రసాదాలు అందజేస్తున్న ఏఈఓ కృష్ణారావు

సత్యదేవుని దర్శించిన మంత్రి వేణు

అన్నవరం: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ మంగళ వారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారి ప్రసాదాలను ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు అందజేశారు.

మంత్రికి, ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు

తుని: అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడిగా పేరూరి బద్రి నారాయణ నియమితులయ్యారు. మంగళవారం తుని మండలం ఎస్.అన్నవరం మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాను బద్రినారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. తుని మండలం తేటగుంట గ్రామానికి చెందిన బద్రి నారాయణకు ట్రస్ట్ బోర్డులో అవకాశం కల్పించినందుకు వైఎస్సార్ సీపీ నాయకులు సీహెచ్ రాంబాబురాజు, రాజబాబు రాజు మంత్రి రాజాను సత్కరించారు. తేటగుంట సొసైటీ అధ్యక్షుడు గుండుబిల్లి వెంకటరమణ, కోలా నాగు పాల్గొన్నారు.

తొండంగి: అన్నవరం దేవస్థానం పాలక మండలి సభ్యురాలిగా ఎ.కొత్తపల్లి బీసీ సామాజిక వర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు, మాజీ ఎంపీటీసీ సాపిశెట్టి భూలక్ష్మిని ఎంపికయ్యారు. ఆమె ఎంపికపై ఆ వర్గం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా సూచనల మేరకు భూలక్ష్మిని ఎంపిక చేశారు. దీంతో తునిలో మంత్రి రాజాను మర్యదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై రాష్ట్ర పెరిక సంఘం కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం గంగాభవాని, వైఎస్సార్ సీపీ తొండంగి మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, పార్టీ నాయకుడు సాపిశెట్టి చిన్న, పి.అగ్రహారం సర్పంచ్ బెక్కం రాధాకృష్ణ, ఎంపీటీసీ అత్తి మణే శ్వరరావు, గోపాలపట్నం సర్పంచ్ కటకం శివ హర్షం వ్యక్తం చేశారు.

శంఖవరం: అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా సక్కా అశ్విని ఎంపికయ్యారు. శంఖవరం గ్రామ మాజీ సర్పంచ్ గామామె సేవలందించారు. ఆమెను ఎంపిక చేయడంపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, అన్నవరం దేవస్థానం ఈఓ సత్యనారాయణ మూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్తిపాడు: అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా దోశీ చిట్టిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనర్ డాక్టర్ పి.జవహర్‌లాల్ మంగళవారం నియామక ఉత్తర్వులిచ్చారు. దోశీ చిట్టిబాబును ప్రత్తిపాడులో ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణ చంద్ర ప్రసాద్ అభినందించారు.